542) వేళావళి/గౌరీ మనోహరి

ప॥ ఎందాకా నీ చలమేమి గట్టుకొంటిని। యిందు వంకనే దొరవిన్నిటా నీవైతివి॥

చ॥ పలుకరాదా కొంత పరాకు మానరాదా। పిలిచి పిలిచి పెదవులెల్లా బెండుపడెను।
నెలవుల నవ్వరాదా చేతలదగ్గరరాదా। నిలువు నివ్వెరగాయ నీకు గానే ప్రేమను॥

చ॥ చక్కగా జూడగ రాదా చలము మానగరాదా। మొక్కి మొక్కి చేతులెల్లా మొనలాయను।
మక్కువతో వినరాదా మన్ననలియ్యగరాదా। యిక్కువలు విన్నవించి యెలుగెల్లా రాసెను॥

చ॥ యింటికిట్టె రారాదా యిటునన్ను గూడరాదా। వెంట వెంట దిరిగాడి వేసటాయను।
అంటి ముట్టి శ్రీవేంకటాధీశ యేలితివి। నంటున నీ తోడి రతి నాభాగ్యమాయను॥